పశువులకు తొలకరి వ్యాధుల దెబ్బ

ముందుగానే టీకాలు వేయించాలని అధికారుల సూచన


ఆవుకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యాధికారి


దూడకు వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరి వైద్య సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్ : వర్షాకాలం వస్తుందంటే రైతుల్లో ఆందోళన, గుబులు పుడుతుంది. రైతులకు వరి సాగు చేయడానికి వర్షం నీరు అవసరమే గాని పాడి పరిశ్రమకు మాత్రం అజాగ్రత్తగా ఉంటే ప్రాణ సంకటం లాంటిది. ముఖ్యంగా ప్రస్తుతం వేసవి కాలంలో వానలు పడుతుండడంతో రైతులు వ్యాధులపై ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో రైతులు వ్యవసాయ ఆధారిత పంటలతోపాటు పాడి పరిశ్రమలకు అధిక ప్రాధాన్యతను ఇస్తుంటారు. వ్యవసాయంలో ఎంత కరువు వచ్చినా, ఎంత నష్టం వచ్చినా ఆ లోటును పాడి పరిశ్రమతో తీర్చుకుని జీవనం సాగిస్తుంటారు. ఇలాంటి ప్రధాన ఆధారమైన పశువుల పట్ల రైతులు ఈ వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ వర్షాకాలంలో పశువుల గొంతువాపు, జబ్బవాపు, చిటుక వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది. ఈ వ్యాధులు జూన్ నుండి సెప్టెంబర్ వరకూ తొలకరి సమయంలో సంభవిస్తుంటాయి. ఈ వ్యాధి సోకిందంటే పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గినట్లుగా రైతులు భావించాలి. ఈ వ్యాధులతో పాల దిగుబడి తగ్గడంతో ఆదాయ మార్గాలు తగ్గిపోతాయి. దాంతో రైతులు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమలోనూ నష్టాలను చవి చూడాల్సి వస్తుంది. పాలకొల్లు , యలమంచిలి మండలంలో గేదెలు 14500, ఆవులు 5000, గొర్రెలు, మేకలు 1400 వరకూ ఉంటాయి. ఈ నేపథ్యంలో పాడిరైతులకు అధికారులు కొన్ని సూచనలు చేస్తున్నారు. అవేంటో ఓ సారి తెలుసుకుందాం.

గొంతు వాపు వ్యాధి

వర్షాకాలంలో పశువులకు ప్రధానంగా వచ్చేది గొంతువాపు వ్యాధి. ఇది పాశ్చరెల్లా మల్టోసిడా అనే సూక్ష్మజీవుల వల్ల వ్యాపిస్తుంది. దీనినే గురకవ్యాధి అంటారు. వర్షాకాలంలో గేదెలు, ఆవులు ముఖ్యంగా దూడల్లో ఎక్కువగా వ్యాపిస్తుంది. ఒక్కోసారి గొర్రెలు, మేకలు, పందుల్లో కూడా వ్యాపిస్తుంటుంది. ఇది అంటువ్యాధిగా ఇతర పశువులకు వ్యాపిస్తుంటుంది. కలుషితమైన నీరు, మేతల వల్ల పశువులకు రోగ నిరోధక శక్తి తగ్గి వ్యాధులు సంక్రమిస్తుంటాయి. కంటి నుంచి నీరు, నోటి నుండి నురగ కారుతూ గురక, శ్వాస పీల్చడం కష్టమవుతుంది. జ్వర తీవ్రత 106, 107 డిగ్రీల వరకూ ఉంటుంది. గొంతు కిందకు నీరు దిగి గొంతు వాపు వస్తుంది. ఈ వ్యాధి వచ్చిన 24 గంటల్లో మరణం సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

నివారణ చర్యలు

వర్షాకాలం ముందు జూన్, జూలై నెలల్లో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వ్యాధి ఉన్న పశువుల దొడ్డిని, గదులను ఫినాయిల్, క్రిసాల్ క్రిమి సంహారక ద్రావకంతో పరిశుభ్రం చేయాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన పశువును వెంటనే పశువుల మంద నుంచి వేరు చేయాలి. వ్యాధి సోకిన పశువులకు వ్యాధి తీవ్రతను బట్టి సల్ఫాడిమిన్, ఇంటాసెఫ్టాజు, ఎక్సెప్టె వంటి ఇంజక్షన్లు ఇవ్వాలి. తప్పనిసరిగా పశు వైద్యాధికారిని సంప్రదించాలి.

గాలికుంటు వ్యాధి, నంజు జ్వరం

ఇది వైరస్ సోకడం లేదా కలుషితమైన గాలి ద్వారా వస్తుంది. తల్లిపాలు ద్వారా దూడలకు సోకే అవకాశం ఉంటుంది. ప్రతి ఏడాది వర్షాకాలంలో గేదె, ఎద్దు, ఆవులకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటి. గిట్టలు ఉన్న ప్రతి జీవికీ ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి సోకిన సమయంలో పశువుకు 104 నుంచి 105 డిగ్రీల జ్వరం ఉంటుంది. నోటిలో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి పశువుల నడవలేని స్థితికి చేరుకుంటాయి. వర్షాలు ఎక్కువగా ఉండి చలిపెడుతున్నప్పుడు ఈ వ్యాధి విజృంభిస్తుంటుంది. ఈ వ్యాధి సోకిన పశువులకు నోటి, గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడతాయి. 3, 4 వారాల్లో బొబ్బలు పగిలి పుండ్లుగా ఏర్పడతాయి. నోటి చిగుళ్లపై పొక్కులు ఏర్పడడం వల్ల పశువులు మేత తీసుకోలేక నీరసించి పోతాయి. ప్రధానంగా వర్షాకాలంలో నేలలు చిత్తడిగా ఉండడంతో గాలి కుంటు వ్యాధులు వస్తుంటాయి. ఈ వ్యాధి వల్ల సూడి పశువులు నీరశించిపోవడం, పాడి పశువులు నుండి పాల దిగుబడి తగ్గిపోతుంది.

నివారణ చర్యలు

ఈ వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ ఫౌడర్, గ్లిసరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లకు పరమాంగనెట్ ద్రావణంతో శుభ్రం చేసి వేపనూనె రాయాలి. యాంటిబయోటిక్స్, పెయిన్‌కిల్లర్స్ వాడితే ఉపశమనం కలుగుతుంది. బిస్ప్రేపెన్ 2.5, ఎన్‌రోప్లాక్సిన్ 50 ఎం.ఎల్, సెఫ్ట్రిక్సోన్ 3 గ్రాములు, మెలోనెక్స్ 30 ఎం.ఎల్, నియోవెట్ 50 ఎం.ఎల్ వాడితే పశువులు పూర్తి ఆరోగ్యంగా ఉంటాయి.

జబ్బ వాపు

ఈ వ్యాధి క్లాస్ట్రిడియం చావై బ్యాక్టీరియా ద్వారా పశువులకు సోకుతుంటుంది. ఈ వ్యాధి పశువులకు ప్రాణహాని కలిగించే తీవ్రమైన అంటువ్యాధి. తెల్ల పశువుల్లో, ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు వయసున్న పశువులకు ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంటుంది. ఈ వయసులో పశువుకు రోగ నిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. మట్టి ద్వారా, కలుషితమైన మేత, నీటి ద్వారా పశువు శరీరంలోకి ప్రవేశించి వ్యాధి సంబవిస్తుంది. భుజం, తొడ ప్రాంతాల్లోని కండరాలను ఆశించి ఆ కంటలు కుళ్లిపోయేలా చేస్తుంది. వాపుతో పశువులు కుంటుతాయి. వెనుక కాలు కాని ముందు కాలుగాని పైకి లేపి కుంటు తుంటాయి.

నివారణ చర్యలు

వ్యాధి ప్రారంభంలోనే పెన్సిలిన్ వంటి యాంటిబయోటిక్స్ వాడాలి. వ్యాధిగ్రస్త పశువులను వేరుగా ఉంచాలి. వ్యాధితో చనిపోయిన పశువులను గుంత తీసి పూడ్చిపెట్టాలి. వ్యాధి రాకుండా వర్షాకాలంలో ముందే వ్యాధి నిరోధక టీకాలను వేయించాలి.

గొర్రెలకు, మేకలకు వ్యాపించే వ్యాధులు

వర్షాకాలంలో పచ్చగడ్డి ఎక్కువగా పెరుగుతుంటుంది. ఈ గడ్డిని తినే మూగజీవాల కడుపులో సూక్ష్మ క్రిములు వెళ్లి చిటుకు వ్యాధి (దొమ్మ రోగం) వస్తుంటుంది. ఈ వ్యాధి సోకిన వెంటనే గొర్రె లేక మేక అతి తక్కువ సమయంలోనే మృతి చెందుతుంటుంది.

నివారణ చర్యలు

ఈ వ్యాధి సోకడానికి ముందుగానే పశు వైద్యులను సంప్రదించి ముందస్తు టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన తరువాత వాటిని రక్షించడం చాలా కష్టం. అందుకు ముందుగానే వైద్యులను సంప్రదించి పలు సూచనలు తీసుకుని సంబంధిత వ్యాధులు సోకకుండా టీకాలు వేయిస్తుండాలి.

రైతులు శ్రద్ధ చూపాలి



వర్షాకాలం వస్తుందంటే రైతులు పశువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనభరచాలి. పశువులకు ప్రధానంగా వర్షం పడిన తరువాత చిగురించే చిరు గడ్డి వల్ల వ్యాధులు సోకుతుంటాయి. గొంతు వాపు లక్షణాలు బయట పడిన 24 గంటల్లోనే పశువు మృత్యువాత పడుతుంది. అందువల్ల వ్యాధి సోకకముందే టీకాలు వేయించాలి. గాలికుంటు వ్యాధి రాకుండా సంవత్సరానికి రెండు పర్యాయాలు వ్యాక్సిన్స్ వేయించాలి.

– డాక్టర్ జి.మల్లేశ్వరరావు, సహాయ సంచాలకులు ప్రాంతీయ పశు వైద్యశాల, పాలకొల్లు

క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన


కోమటితిప్పలో కూలీల మస్తర్‌ను పరిశీలిస్తున్న జేఈ ఆనంద్

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. వ్యవసాయపనులు అంతంత మాత్రంగా ఉండటంతో ఉపాధి కూలీలు, పంటబోదెల తవ్వకాలకు ప్రాధాన్యమిస్తున్నారు. మండలంలో భారీ మంచి నీటి చెరువులు ఉన్న ప్రాంతాలలో పూర్తి స్థాయిలో మంచినీటి చెరువులు తవ్వేందుకు పనులుచేపట్టారు. మొగల్తూరు, కేపీ పాలెంలోని పంటబోదెల నుంచి మంచినీటి చెరువులకు వేళ్ళే పనులు పూర్తికావచ్చాయి. శుక్రవారం కాళీప్నటం మంచి నీటి చెరువులోకి నీరు వెళ్లేందుకు కోమటితిప్పలో పంట బోదె తవ్వకం పనులు చేపట్టారు. దీంతో జేఈ ఆనంద్ కూలీల మస్తర్‌ను పరిశీలించి కూలీలకు పలు సూచనలు చేశారు.

నరసాపురంలో భారీ వర్షం


నరసాపురం పట్టణంలో వర్షం పడుతున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలో శుక్రవారం ఉదయం నుంచి భారీ వర్షం పడింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉదయం 10 గంటలు నుంచి గంటపాటు తెరిపిలేకుండా వర్షం పడింది. తరువాత సాయంత్రం వరకూ కూడా చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. కొన్ని రోజులుగా ఎండవేడిమితో అల్లాడుతున్న జనానికి ఈ రెండు రోజుల నుంచికురుస్తున్న వర్షం ఉపసమనాన్ని ఇచ్చింది. తీరంలో అకాలవర్షాలకు మామిడి, ఉప్పు రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణీల సమస్యల పరిష్కారం కోసం శనివారం ఉదయం 11 గంటలు నుంచి 12 గంటలు వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డీఎం ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీలో అందిస్తున్న కార్గో సేవలు, కార్గో డోర్ డెలివరీ సేవలు, విద్యార్థుల రాయితీ, ప్రత్యేక బస్సులు తదితర అంశాలపై ఫిర్యాదులు, సూచనలు స్వీకరించి పరిష్కరిస్తామని చెప్పారు. నరసాపురం డిపో పరిధిలోని నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, మార్టేరు, పెనుగొండ, ఆచంట చుట్టుప్రక్కల ప్రాతాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సమస్యలు ఉన్నవారు 99592 25486 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు


పెనుగొండలో మూలవిరాట్ వాసవీ మాతకు పూజలు చేస్తున్న దృశ్యం

పెనుగొండ: ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకల్లో భాగంగా మూలవిరాట్ శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధని వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం 102 మంది కన్యల పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి నగరేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం 102 మంది కన్యల పూజను భక్తి వేడుకగా నిర్వహించారు. చిన్నారులంతా కన్యలపూజలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం వాసవీ మాతకు లక్ష మల్లికా పుష్పార్చన నిర్వహించారు. 102 మంది కన్యల పూజలు అనంతరం చిన్నారులకు, భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. వాసవీ గీత మహిళా సమాజం ఆధ్వర్యంలో వాసవీ పురాణం పఠించారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ నూలి తాతాజీ, ట్రస్టీలు, దేవాదాయ శాఖాధికారులు పాల్గొన్నారు.


మూలవిరాట్ వాసవీ మాతకు లక్ష మల్లికా పుష్పార్చన నిర్వహిస్తున్న దృశ్యం

నేడు వాసవీ జయంతి

తొలి త్యాగశీలిగా పేరుగాంచిన వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి జయంతి శనివారం నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని బజారు రామాలయం నుంచి 102కలశాలతో మహిళలు, వాసవీ మాలధారులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం ఆలయ ప్రాంగాణంలో గణపతి హోమం, వాసవీ హోమం నిర్వహిస్తారు. అనంతరం భారీ అన్నసమారాధన, నాలుగు గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం దాససాహిత్య ప్రాజెక్టుకు చెందిన బోడపాటి రాజ్యలక్ష్మీ ఆధ్వర్యంలో 100 మంది హరే శ్రీనివాసా భజన మండలల కోలాటం, గరుడాద్రి, శేషాద్రి డోలు బృందం, దాస సాహిత్య ప్రాజెక్టు , అమలాపురానికి చెందిన ప్రసాద్ గరగల బృందం ద్వారా సాంస్కృతిక కార్యక్రమం, అనంతరం వాసవీ మాత గ్రామోత్సవం, వాసవీ పురాణ పఠనం, ఊయల సేవ నిర్వహించనున్నారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వాసవీ శాంతి థాంలో

వాసవీ జయంతి ఉత్సవం అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలో శనివారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీఎస్ గోవిందరాజులు తెలిపారు. మరకత శిల వాసవీ మాతకు అభిషేకాలు, పుష్పాలంకరణ చేయనున్నట్లు తెలిపారు.

అధిక రక్తపోటుపై అవగాహన



అధిక రక్తపోటుపై అవగాహన కల్పిస్తున్న అడ్డాల ప్రతాప్‌కుమార్

పాలకొల్లు అర్బన్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజల్లో ఎక్కువశాతం మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నట్లు ఆరోగ్య పరిశోధనలు వెల్లడిస్తున్నాయని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం లంకలకోడేరు -2 సచివాలయం, అలాగే అరట్లకట్ట గ్రామ సచివాలయం, అరట్లకట్ట కమ్ము ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరంలో 30 సంవత్సరాలు దాటినవారికి బీపీ పరీక్షలు నిర్వహించి అధిక రక్తపోటుతో బాధపడుతున్న వారిని గుర్తించి మందులు అందజేసి సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ఆహారంలో ఉప్పు శాతం పెరగడం వల్ల అధిక రక్తపోటు పెరుగుతుందని, దీనివలన గుండె సంబంధిత వ్యాధులకు గురవుతున్నారన్నారు. భుజించే ఆహారంలో మసాలాలతో పాటు ఆల్కహాల్, ధూమపానం చేయడం వల్ల రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడి అధిక రక్తపోటు పెరుగుతుందన్నారు. రక్తంలో కొవ్వు పెరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతి రోజూ వ్యాయామం, యోగ చేయడం వల్ల బీపీ తగ్గించుకోవచ్చన్నారు. బీపీ ఉన్న రోజులు మందులు సక్రమంగా వాడకపోతే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ అవగాహన సదస్సులో డా. ఎం.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్, ఫార్మాసిస్టు పీవీ స్వామి, సూపర్‌వైజర్లు ఎస్‌కే అమరేశ్వరరావు, జి.ఉదయ్‌చంద్ర, డి.కమల పాల్గొన్నారు.

చురుగ్గా రహదారి నిర్మాణ పనులు

మొగల్తూరు: మొగల్తూరు కడలివారి పాలెం నుంచి పెద్దపల్లవపాలెం వరుకు నిర్మించేందుకు చేపట్టిన రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. నరసాపురం, సతారాంపురం, మొగల్తూరు మీదుగా జాతీయ రహదారి విస్తరించింది. దీనిలో భాగంగా మొగల్తూరు గ్రామంలోకి వెళ్లేందుకు స్థానిక ప్రధాన రహదారిని కూడా జాతీయ రహదారుల శాఖ విస్తరించాల్సి ఉంది. దీంతో మొగల్తూరులోని కడలివారిపాలెం నుంచి పాతకాలువ, రామాలయం సెంటర్, గాంధీ బొమ్మల సెంటర్, లాకు మీదుగా పెద్దపల్లవపాలెం వరకు రహదారి నిర్మించేందుకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ రూ.10 కోట్లు మంజూరు చేసింది. దీంతో మొగల్తూరు ప్రధాన రహదారి నిర్మించేందుకు పనులు చేపట్టామని పనుల పూర్తయిన తరువాత రాష్ట్ర ఆర్ అండ్‌బీ శాఖకు రహదారిని అప్పగించనున్నట్లు జాతీయ రహదారుల శాఖ డీఈ కిరణ్ కుమార్ తెలిపారు.

ప్రమాదకరంగా డ్రెయిన్

నరసాపురం: పట్టణంలో రాజరాజేశ్వరి థియేటర్‌కు వెళ్లే దారిలో మలుపులో ఉన్న డ్రెయిన్ ప్రమాదకరంగా ఉంది. డ్రెయిన్‌పై మూతలు సవ్యంగా లేవు. సరిగ్గా మలుపులో గొయ్యి ఉండటంతో అటుగా వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా పల్లపుప్రాంతం కావడంతో వర్షం వస్తే రెండు, మూడు గంటలు వరకూ నీరు నిల్వ ఉండిపోతుంది. ఆ సమయంలో అక్కడ గొయ్యి ఉందనే సంగతి కూడా తెలియదు. నిత్యం వందల మంది ఇటుగా ప్రయాణిస్తుంటారు. వారంతా భయపడుతూ అడుగులు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. మునిసిపాలిటీ మాత్రం ఈ డ్రెయిన్ అభివృద్ధి విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఈ అంశంపై దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత


శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

పోడూరు: బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుమ్మలూరు గ్రామంలో విద్యార్థులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. గ్రామంలో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 270 మంది విద్యార్థులకు కంప్యూటర్ పై ప్రాథమిక అవగాహన, గణితంలో మెలుకువశ పై ఉచితంగా శిక్షణను ఇచ్చారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ జీవీఎస్ఎస్ రవి ఆనంద్, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు ప్రయాణ రాయితీ ఇవ్వాలి

పాలకొల్లు సెంట్రల్: భారతీయ రైల్వే శాఖ సీనియర్ సిటిజన్స్‌కు గతంలో టికెట్ పై రాయితీ ఇచ్చేవారని ఈ రాయితీని కేంద్ర ప్రభుత్వం గత కొంతకాలంగా నిలిపివేసిందని పాలకొల్లు సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు వంగా నరసింహారావు తెలిపారు. శుక్రవారం నరసింహారావు విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్‌కు ఇచ్చే రాయితీపై ఒకసారి పురనాలోచన చేసి మళ్లీ పునరుద్దరణ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పాలకొల్లు రైల్వే స్టేషన్లో త్వరగా లిఫ్ట్ సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే రెవెన్యూ, మునిసిపల్, బ్యాంకులు ఇలా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సీనియర్ సిటిజన్స్‌కు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు కుటుంబపరంగా వ్యక్తిగత సమస్యలు ఉంటే తనను సంప్రదించాలని వంగా నరసింహారావు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు యర్రంశెట్టి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం

పాలకొల్లు అర్బన్: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయ ఆవరణలో శనివారం ఉదయం 9.30 గంటలకు యలమంచిలి మండల ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్యాలయ ప్రతినిధి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 10.30గంటలకు పాలకొల్లు మండల నాయకులతోనూ, 11.30గంటలకు పాలకొల్లు పట్టణ నాయకులతోనూ, 12.00 గంటలకు పోడూరు మండల నాయకుల విస్తృత స్థాయి సమావేశం జరుగుతుందని వివరించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమంలో పార్టీ శ్రేణులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

తిరు కల్యాణ మహోత్సవాల ప్రారంభం

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు గ్రామంలో స్వయంభు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కల్యాణ మహోత్సవంలో భాగంగా సాయంత్రం 6 గంటలకు మంగళ వాయిద్యాలు నడుమ వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ధ్వజారోహణ సందర్భంగా సంతానం లేని దంపతులు సంతానం కోసం శ్రీ స్వామివారి గరుడ పొంగలి విశేష ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.











